క్లుప్తంగా

ఏఐటీయూసీ కార్మికుల పక్షం

సింగరేణి(కొత్తగూడెం): ఏఐటీయూసీ ఆవిర్భవించి, నేటికి 105 సంవత్సరాలు. ఈ సందర్భంగా కొత్తగూడెం కార్పొరేట్, ఏరియాలలో వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో ఏఐటీయూసీ నాయకులు జెండా ఎగురవేశారు. మాట్లాడుతూ.. ఏఐటీయూసీకి ఒక చరిత్ర ఉందని, కార్మికుల హక్కుల కొరకు నిత్యం పోరాడుతూ అనేక హక్కులు సాధించినట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో యూనియన్లు అసోసియేషన్లను ఒకే తాటిమీదికి తెచ్చి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అవుట్ సోర్సింగ్‌కు వ్యతిరేకంగా పోరాడినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 44 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను హరించివేయడంపై ఏఐటీయూసీ పోరాడుతుందన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమానికి సిద్ధం

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యల సాధనకై పీఆర్‌టీయూ ఉద్యమానికి సిద్ధం అవుతుందని యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఐదు పెండింగ్ డీఏలలో కేవలం ఒకటి మాత్రమే ప్రకటించడం ఉపాధ్యాయ, ఉద్యోగులకు అవమానించడమేనని, వెంటనే నాలుగు డీఏలను ప్రకటించాలన్నారు. దీంతో పాటుగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రత్యేక పరిస్థితులు కలిగిన కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని విన్నవించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లించండి..

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో పని చేస్తున్న 48 మంది కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలుగూరి మధు, భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నేత అబ్దుల్ నబీ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన బోనస్ డబ్బులు నేటికీ కార్మికులకు చేరకపోవడం శోచనీయమన్నారు. బానోత్ వస్రం, పూనెం రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం..

కొత్తగూడెంరూరల్: ఏజెన్సీలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ భూక్యా మంగీలాల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో బుధవారం ఎల్‌హెచ్‌పీ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడిగా భూక్యా సురేష్‌నాయక్‌కు జిల్లా కన్వీనర్ నియామాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సమావేశంలో భిక్షపతినాయక్, రవి, సురేష్, బానోతు కళ్యాణ్, వినోద్, వెంకటేష్, గణేష్, సుమన్, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.


పాల్వంచ: త్రివేణి పాఠశాలలో పండుగ సంబురాలు


శ్రీవిద్య పాఠశాలలో...


టేకులపల్లి: టపాసుల దుకాణం వద్ద సందడి..

వెలుగుల పండుగ దీపావళి

- అప్రమత్తతతోనే ఆనంద దీపావళి
- ప్రమిదలు, విద్యుత్ దీపాలతో ఇళ్లకు అలంకరణ
- లక్ష్మీపూజకు మహిళల సమాయత్తం

ఇల్లెందురూరల్: అమావాస్య చీకటిలో వెలుగులు విరజిమ్మే పండుగ దీపావళి. జీవితంలో కష్టసుఖాలు ఉన్నట్లే వెలుగుపూలు విరజిమ్ముతూ ప్రమోదాన్ని పంచిపెట్టే దీపావళి పండుగ సైతం ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. నూతన వస్త్రాలు, లక్ష్మీపూజ, పిండివంట రుచులతో ప్రతీఒక్కరు ఆనందంగా బాణాసంచా కాల్చడం ఆనవాయితీ. ఈ వెలుగు జిలుగుల పండుగను ప్రజలు గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు.

టపాసుల వినియోగంలోనూ శాస్త్రీయత..

దీపావళి పండుగంటేనే టపాసుల పండుగ. అందరూ టపాసులు పేలుస్తూ ఆనందాన్ని పంచుకుంటారు. ఈ టపాసుల వినియోగంలోనూ శాస్త్రీయత ఉందని పెద్దలు చెబుతుంటారు. వానాకాలపు తాకిడికి విజృంభించే సూక్ష్మజీవులను పారదోలేందుకు టపాసులు ఎంతో పనిచేస్తాయి. ఎండాకాలంలో దోమలు పెట్టిన గుడ్లు వర్షాకాలంలో పిల్లలవుతాయి. చలికాలానికి పరిపూర్ణమైన దోమగా ఎదిగి రోగాలను వ్యాప్తి చేస్తాయి.

ఇదే తరుణంలో కొన్ని కీటకాలు నశించాలంటే ప్రజలందరూ ఒక్కసారి పూనుకోవాలి. అందుకే దీపావళి పేర టపాసులను పేల్చుతారు. ఈ టపాసులను కాల్చినప్పుడు వాటి నుంచి వెలువడే రసాయనాల వల్ల, ఘాటైన పొగవల్ల క్రిమికీటకాలు, దోమలు నాశనమవుతాయి.



లక్ష్మీపూజ ప్రత్యేకం...

దీపావళి అంటే లక్ష్మీపూజలు ప్రత్యేకం. అమావాస్య రోజున ఇళ్లల్లో, దుకాణాల్లోనూ పూజలు చేస్తారు. సహస్రనామాలు, అష్టోత్తరాలు, దండకాలు, భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారు. దీపావళి నాటి రాత్రి ధనలక్ష్మి సంచారం చేస్తుందని అప్పుడామెకు ఏ ఇల్లు అందంగా కనిపిస్తే ఆ ఇంట్లో నివాసముంటుందని ప్రజల విశ్వాసం. లక్ష్మీదేవి కటాక్షం తమ ఇళ్లలో కొలువుదీరాలని వేడుకుంటూ పూజలు చేస్తారు. దీపారాధన ఆనవాయితీగా వస్తోంది. అశ్వయుజ బహుళ త్రయోదశి నుంచి కార్తీక శుద్ధ విదియ వరకు మహాలక్ష్మి నూనెలో, నీటిలో నివాసముంటుందన్న విశ్వాసంతో మహిళలు ఆ రోజుల్లో ప్రమిదలతో ఇళ్లను అందంగా అలంకరిస్తారు.

ఆరోగ్యంపై బాణాసంచా ప్రభావం..

ఒకప్పుడు దీపావళి అంటే అందరూ ఎగిరి గంతేసేవారు. ఇప్పుడు జంకే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం చాలామంది శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావాన్ని చూపిస్తోంది. ఇదంతా సాధారణ రోజుల్లోనే. మరి దీపావళి పండుగప్పుడు పరిస్థితి.. ఆలోచిస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. సాధారణ వాయు కాలుష్యంతోపాటు బాణాసంచా కారణంగా కాలుష్య ఉద్గారాల తీవ్రత దాదాపు రెట్టింపవుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా సూక్ష్మ ధూళికణాలు, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్, సల్ఫర్ డయాక్సైడ్ అధికంగా వెలువడుతుంది. టపాసులు పేల్చడం వల్ల విషవాయులు పర్యావరణాన్ని విషతుల్యం చేస్తాయి. వీటిని పీల్చడం వల్ల పిల్లల నుంచి పెద్దల వరకు అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు.

దీపావళి వేళ ప్రమిదలే ముద్దు...

దీపావళికి కాల్చే బాణాసంచా కొందరికి ఆనందాన్ని ఇస్తుండగా ఎక్కువ మందికి ఇబ్బందిగా పరిణమిస్తోంది. ఇకనైనా వీటికి దూరంగా ఉండి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ ముందుకు రావాలి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచడం, ఇంటికి విద్యుత్ కాంతులు విరజిమ్మేలా అలంకరణ చేసుకోవచ్చు. వివిధ ఆకృత్తుల్లో ఉండే ప్రమిదల్ని వెలిగించుకోవచ్చు.

పాఠశాలల్లో ఘనంగా వేడుకలు..

పాల్వంచ: దీపావళి పండుగ సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీ విద్య పాఠశాలలో విద్యార్థులు టపాసులు కాల్చి సంబురాలు జరిపారు. ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. త్రివేణి పాఠశాలలో లక్ష్మీపూజ నిర్వహించారు. విద్యార్థులు టపాసులు కాల్చారు. ప్రిన్సిపాల్ నేతాజీ, డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్‌ఓ మురళీ కృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏటీఎఫ్ కోరింది. బుధవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాసరావు, కబ్బాకుల రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నవంబర్ 6 నుంచి చేపట్టనున్న సమగ్ర సాంఘిక, ఆర్థిక, రాజకీయ కులగణన సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొనాలని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా సహకరిస్తామని భట్టికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సర్వేకు గౌరవ వేతనం చెల్లించాలని కోరినట్లు తెలిపారు. ఉండం నాగేందర్, చాపల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ 'విద్యుత్' సంబురాలు


ఇల్లెందు: మాట్లాడుతున్న బానోతు హరిప్రియ

ఇల్లెందు: గడిచిన పదేళ్లల్లో బీఆర్‌ఎస్ విద్యుత్ చార్జీలు పెంచలేదు. గత పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బారం మోపేందుకు ప్రయత్నించిందని బీఆర్‌ఎస్ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, దిండిగల రాజేందర్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల బారం పడకుండా అడ్డుకోగలిగామని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పిలుపులో భాగంగా బుధవారం ఇల్లెందులో సంబురాలు నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, టపాసులు పేల్చారు. మాట్లాడుతూ... కేవలం పది నెలల్లో రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీలు ప్రజలపై బారం మోపాలని ప్రయత్నించటం దుర్మార్గం అన్నారు. లకావత్ దేవీలాల్ నాయక్, సిలివేరు సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.18,500 కోట్ల బారాన్ని మోపాలనే ప్రయత్నాన్ని ప్రధాన పక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ విద్యుత్ చార్జీల పెంపును నిలుపుదల చేసిందని పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, కాంపెల్లి కనకేష్ అన్నారు.

బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కె.సింధు తపస్వీ, హర్షవర్ధన్, రంజిత్, కిరణ్, ప్రసాద్, అఖిల్, సాయి, గోకుల్, సురేష్, ఆలీ, సాయి కిరణ్, భరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం నెలకొల్పాలి

పాల్వంచ: అవినీతి రహిత సమాజం నెలకొల్పేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కేటీపీఎస్ 7వ దశ సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. నిఘా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కేటీపీఎస్ ఉద్యోగులతో కలిసి సర్వీస్ బిల్డింగ్ నుంచి అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వరకు బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవినీతిని నిర్మూలించాలని నినాదాలు చేశారు. సీఈ మాట్లాడుతూ... అన్నిరంగాల్లో అవినీతి పాతుకుపోయిందని, దీనివల్ల పారదర్శకత లోపిస్తోందన్నారు.

జాబ్ మేళాకు స్పందన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రియదర్శిని కళాశాలలో జెన్ ప్యాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీకాం, బీఎస్సీ, బీసీఏతో పాటు బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు సుమారు 448 మంది హాజరయ్యారు. కంపెనీ అధికారులు మూడు రౌండ్లలో పరీక్షలు నిర్వహించి 32 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి నియామక పత్రాలు అందజేసినట్లు ప్రియదర్శిని కళాశాలల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు.

ఫ్రీజర్ వితరణ

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామ పంచాయతీకి దుద్దుకూరి రామయ్య - రాంబాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు దుద్దుకూరి మధుసూదన్‌రావు, నరసింహారావు ఫ్రీజర్ బాక్స్‌ను వితరణ చేశారు. బుధవారం రాంబాయమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా లేళ్ల వెంకటరెడ్డి చేతుల మీదుగా ఫ్రీజర్ గ్రామ పంచాయతీకి అప్పగించారు. నర్వనేని పుల్లారావు, సాయిల కృష్ణయ్య, ధరావత్ రాంబాబు పాల్గొన్నారు.

పంటపొలాలకు నీళ్లు అందించండి..

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్ట్ వల్ల పరిసర గ్రామాలల్లోని చెరువుల్లో నీళ్లు త్వరగా అడుగంటుతున్నాయని, దానివల్ల ఆయకట్టు పొలాలు చివరి దశలో ఎండిపోతున్నాయని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు కష్టపడి వరి పంటకు పెట్టుబడి పెట్టి చివరి దశలో నష్టపోతున్నారని వాపోయారు. తెల్లవాగు చెరువు జేత్యా తండా, చంద్రయ్య చెరువు రావులపాడు, గడ్డి చెరువు లచ్చగూడెం, చాకలి ఒర్రె చుక్కాల బోడు వాటి కింద సుమారు 1500 ఎకరాల్లో వరి సాగయిందన్నారు. కేటీసీలో బాంబు పేలుళ్ల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, వేసిన వరిపొలం ఎండిపోతోందన్నారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు స్పందించి ప్రాజెక్ట్ నీళ్లతో చెరువులను నింపి రైతులకు సాగు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

పాల్వంచరూరల్: ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్‌చరణ్ పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, తహసీల్‌లో ఆర్‌ఐ రవికుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.8కోట్ల నిధులు విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంటర్, పారామెడికల్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలను బంద్ చేసి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నాగకృష్ణ, అఖిల్, నాగబాబు, సమీర, సుభద్ర, లక్ష్మీప్రసన్న, సుమంత్, సంతోష్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బయ్య అభిమన్యు, బానోత్ కిషన్, సాగర్, నవీన్, సుధీర్, రఘు, రవి, చరణ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను విజయవంతం చేయండి..

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ కె.రవికుమార్ అన్నారు. బుధవారం ఇల్లెందు సీఈఆర్ క్లబ్‌లో ఇల్లెందు మున్సిపాల్టీ నుంచి 81 మంది, మండలం నుంచి 139 మంది ఎన్యూమరేటర్లు, 22 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ... వచ్చే నెల 6 నుంచి ప్రారంభ కానున్న సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రజల సమాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించాలన్నారు. ప్రతీ బ్లాక్‌లోని అన్ని కుటుంబాల వివరాలను నమోదు చేయాలని, ప్రతీ ఇంట్లో కుటుంబ సభ్యుల సంఖ్య, ఇంటి నంబర్, ఇంటి యజమాని, పేరు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు తదితర వివరాలు ఫారంలో నమోదు చేయాలన్నారు. సర్వే పూర్తి అయిన తర్వాత ఆ ఇంటికి స్టిక్కర్ అంటించాలని తెలిపారు. కుటుంబ యజమాని నుంచి సేకరించిన సమాచారం రహస్యంగా ఉంచాలన్నారు.

పెరిగిన టిప్పర్ డ్రైవర్ల వేతనాలు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టు నుంచి బీపీఎల్, నవభారత్, తడికలపూడి ఇంకా వివిధ ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా బొగ్గు సరఫరా చేస్తున్న డ్రైవర్లకు వేతనాలు పెరిగాయని తెలంగాణ ప్రగతిశీల మోటార్ మరియు ఆటో వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, నాయకులు డి.ప్రసాద్, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కోయగూడెం టిప్పర్ డ్రైవర్లతో టేకులపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు సమష్టిగా, సంఘటితంగా ఉద్యమించడం వల్ల వేతనాలను పెంచుకోగలిగామన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, డ్రైవర్లు, నాయకులు భద్రం, సమ్మయ్య, ముత్తేష్, నాగేందర్, రవి, మధు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.